క్లుప్తంగా

నేడు వెంకటనగరంలో గడపగడపకూ

ప్రత్తిపాడు రూరల్: వెంకటనగరంలో బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల నేత రామిశెట్టి చినబాబు మంగళవారం తెలిపారు. ఎమ్మెల్యే పూర్ణచంద్ర ప్రసాద్ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుంటారన్నారు. అధికారులు, ప్రజా వైఎస్సాస్సార్ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కాంట్రాక్ట్ లెక్చరర్ల నూతన అధ్యక్షుడికి సన్మానం


లెక్చరర్ సన్మాన కార్యక్రమంలో అధ్యాపకులు

జగ్గంపేట: కాంట్రాక్ట్ లెక్చరర్ల కాకినాడ జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎంపికైన పెనుమాల రామకృష్ణను జగ్గంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఘనంగా సన్మానించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.బాబ్జి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎ.శ్రీనివాసరావు, సీహెచ్ రాంబాబు, కె.సత్యనారాయణ, ఆర్.శ్రీనివాసరావు, డీఎస్ఆర్‌కే కృష్ణ, పీఎస్ భవానీ, బి.నీలిమ, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

రెండు కోళ్ల ఫారాల దగ్ధం

ప్రత్తిపాడు రూరల్: పెద్దిపాలెం సోమవారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. గ్రామానికి చెందిన రీసు సత్యనారాయణ కోళ్ల ఫారంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాప్తి చెందాయి. ఈ ప్రమాదంలో రెండు కోళ్ల ఫారాలు, సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు అప్రమత్తమై మంటలను అదుపు చేశారు. దీంతో కొంత మేర ఆస్తి నష్టాన్ని నివారించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన చేరుకొనే లోపే జరగవలసిన నష్టం జరిగిపోయింది. ఈ ప్రమాదంలో రూ.3.లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది.

అన్నసమారాధన

కిర్లంపూడి: రాజుపాలెం గ్రామంలోని సాయి బాబా ఆలయ 22వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఆలయ ధర్మకర్త ఇంధన బ్రహ్మానందం దంపతులు ఆధ్వర్యంలో సాయిబాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నసమారాధనకు స్థానిక, పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

ఉపాధి పనుల పరిశీలన

కిర్లంపూడి: సింహాద్రిపురంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి పరిశీలించారు. ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కూలీల మస్టర్లను తనిఖీ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పని దినాలు కల్పించాలని ఏపీఓ బి.చిరంజీవిరావును ఆదేశించారు. స్థానిక సచివాలయాలకు వెళ్లి తమ జాబ్‌కార్డుకు ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేసుకోవాలని ఉపాధి కూలీలకు ఆమె సూచించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ప్రత్తిపాడు: ఎలుకల మందు తాగి ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. స్థానిక పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన పడాల శ్రీను(50) బోటు పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మద్యానికి బానిసై, అప్పుల పాలయ్యాడు. దీంతో జీవితంపై విరక్తితో సోమవారం సాయంత్రం మద్యంలో ఎలుకల మందు కలుపుకొని తాగి, ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మారకస్థితిలో ఉన్న శ్రీనును కుటుంబ సభ్యులు స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. మృతదేహాన్ని శవపరీక్ష కోసం తరలించారు. కుమారుడు నాగబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కె.సుధాకర్ కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

పథకాలపై అవగాహన

కిర్లంపూడి: పంట నమోదును సకాలంలో పూర్తి చేయాలంటూ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఎన్.విజయ్‌కుమార్ అన్నారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో మంగళవారం వ్యవసాయ సహాయకులు, గ్రామ ఉద్యాన సహాయకులతో రివ్యూ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో ఇప్పటికే 430 టన్నులు యూరియా, 30 టన్నులు డీఏపీ, కాంప్లెక్సు 50 టన్నుల ఎరువులు రైతులకు అందజేశామన్నారు. ధాన్యం కొనుగోలు సమయంలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ప్రతి రైతు పంట నమోదు, ఈ-కేవైసీ తప్పని సరిగా చేయించుకోవాలన్నారు. డాక్టర్ వైఎస్సార్ పొలంబడి, వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అందజేసే పలు పథకాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ జోకా అమృత, వ్యవసాయ సహాయ సంచాలకులు దైవ కుమార్, వ్యవసాయ శాఖ టెక్నికల్ ఆఫీసర్ పద్మజ ఉన్నారు.

గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ

- ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు
- వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణోత్సవాలు
- స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు


తుర్పులక్ష్మీపురంలో కనుల పండువగా జరుగుతున్న స్వామివారి కల్యాణం


ప్రత్తిపాడు వేణుగోపాల స్వామి వారి ఆలయంలో పసుపు దంచుతున్న ముత్తైదువులు


తంటికొండలో వేంకటేశ్వర స్వామికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు


వధూవరులుగా ముస్తాబైన స్వామి, అమ్మవార్లు

గ్రామాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారి కల్యాణానికి ఏర్పాటు పూర్తి చేశారు. ఇతర ఆలయాల్లో స్వామి వారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి తిలకించారు.

ఏలేశ్వరం: తూర్పులక్ష్మీపురంలో శ్రీదేవి భూదేవి సమేత అభయ వేంకటేశ్వరస్వామి ఎనిమిదో వార్షిక కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పతివాడ రవిబాబు, గ్రామస్తుల సహకారంతో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు కిమ్మూరి సత్యనారాయణ పంతులు ఆధ్వర్యంలో ఏలేశ్వరం నగర పంచాయతీ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, చలమయ్య దంపతులు, వీరంరెడ్డి తాతబాబు దంపతులతో పాటు సుమారు 20 మంది దంపతులచే ఈ పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆలయప్రాంగణం కల్యాణ శోభతో నిండిపోయింది. ఏలేశ్వరానికి చెందిన విద్యార్థులచే కోలాటం నిర్వహించారు. అనంతరం సుమారు 2 వేల మందికి అన్నదానం చేశారు. నాయకులు అలమండ దుర్గావెంకటప్రసాద్, కటకం కిరిటీ, అలమండ వీరరాఘవస్వామి, పైల శ్రీధర్, ధర్మజాగరణ సంస్థ ప్రసంగీకుడు దత్తాత్రేయ తదితరులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

వేడుకగా వేణుగోపాల స్వామి కల్యాణం

ప్రత్తిపాడు: స్థానిక రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాల స్వామి వారి కల్యాణ వేడుకలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ స్థానాచార్యులు పాల్వంచ లక్ష్మణాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు పాల్వంచ లక్ష్మీనరసింహచార్యులు పూజలతో వేడుకలకు శ్రీకారం చుట్టారు. పుణ్యాహవచనం, అంకురార్పణ తదితర పూజాక్రతువులను నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఆశీనులు చేసి నూతన వధూవరులుగా ముస్తాబు చేశారు. ముత్తైదువులు పసుపు దంచారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయంలో బుధవారం స్వామి వారి కల్యాణ మహోత్సవం ఘనంగా జరుగనుంది. పాంచరాత్ర ఆగమయుక్తంగా కల్యాణం జరిపించేందుకు ఆచార్యులు నిర్ణయించారు. 2వ, 3వ తేదీల్లో నిత్యహోమం, బలిహరణ, తీర్థ ప్రసాద వినియోగం, 5న రాత్రి పూర్ణాహుతితో కల్యాణోత్సవాలు ముగుస్తాయి.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

తొండంగి: ఎ.వి.నగరంలో వేంకటేశ్వరస్వామి ఆరో వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామివారి ఆలయ ప్రాంగణంలో సాయిబాబా ఆలయంలో కూడా పూజలు జరిగాయి. బుధవారం వేంకటేశ్వరస్వామి ఆలయంలో 108 కలశాలతో అష్టోత్తర శత కలశ అభిషేకం, లక్షతులసి పూజ, పది గంటలకు కల్యాణోత్సవం వంటి వైదిక కార్యక్రమాలు జరుగుతాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

నేటి నుంచి విశ్వేశ్వరుని కల్యాణోత్సవాలు

ఒంటిమామిడి విశ్వేశ్వరుని కల్యాణోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ ఏకైక ధర్మకర్త, ప్రధనార్చకులు శుంకరణం గోవిందరావుశర్మ తెలిపారు. దేవదాయ ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో ఈనెల 5 వరకూ స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు.

తంటికొండ వెంకన్న గ్రామోత్సవం

గోకవరం: తంటికొండ గ్రామంలో వెంకటగిరి కొండపై వేంచేసి ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి గ్రామోత్సవం అంబరాన్నంటింది. బ్రహ్మోత్సవాల ముగింపును పురస్కరించుకుని స్వామి వారిని మంగళవారం ఉదయం గరుడ వాహనంపై ఉంచి గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాటాలు, మ్యూజికల్ బ్యాండ్, డప్పు వాయిద్యాలు వంటి పలు సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి రాంబాబు(రెడ్డి), ఈఓ ఆర్‌వి చందన, ధర్మకర్తల మండలి సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులందరూ పాల్గొని స్వామివారికి పల్లకి సేవ నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకూ ఈ ఊరేగింపు జరిగింది. గ్రామ పెద్దలు, దేవస్థానం సిబ్బంది, ఆలయ అర్చకులు, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం రాత్రి ఏడు గంటలకు స్వామి వారికి తెప్పోత్సవం నిర్వహించనున్నట్టు ఈఓ ఆర్‌వీ చందన తెలిపారు.

పాండవుల మెట్ట తీర్థానికి ఏర్పాట్లు పూర్తి

గోకవరం: రంపయర్రంపాలెం గ్రామంలో ఉన్న పాండవుల మెట్ట ఐదు రోజుల పాటు జరిగే తీర్థానికి సుందరంగా ముస్తాబైంది. బుధవారం నుంచి జరిగే ఈ తీర్థానికి ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. పవిత్ర భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని ఏటా ఇక్కడ ఐదు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది కూడా తీర్థాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. తీర్థం సందర్భంగా పాండవుల మెట్టను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఈ తీర్థానికి జిల్లా నుంచే కాకుండా వివిధ జిల్లాల నుంచి ప్రజలు వస్తుంటారు. తీర్థానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు తెలిపారు. తీర్థం సందర్భంగా కబడ్డీ టోర్నమెంటు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. తొలిరోజు ఆలయం వద్ద భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు.

ఘనంగా చండీహోమం

తొండంగి: స్థానిక కృష్ణాలయం సెంటర్ వద్ద దుర్గాంబికా ఆలయ ప్రథమ వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం మహా చండీహోమం ఘనంగా జరిగింది. దాతల సహకారంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు అమ్మవారి వార్షికోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామంలోని మహిళలందరూ బోనాలు సమర్పించగా అమ్మవారికి అభిషేకించారు. ఈ సందర్భంగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

వ్యవసాయానికి విద్యుత్ కొరత లేకుండా చర్యలు

- ఎంపీ వంగా గీత


రత్నగిరిపై మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ వంగా గీత, పక్కన ఎమ్మెల్యే పర్వత

అన్నవరం: వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందజేస్తోందని ఎంపీ వంగా గీత అన్నారు. మంగళవారం అన్నవరంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ సాగునీరు, తాగునీటికి ఆటంకం లేకుండా ప్రభుత్వం 24 విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందన్నారు. వాటిలో 12 కాకినాడ జిల్లాకు మంజూరు చేసిందన్నారు. వ్యవసాయాధారమైన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గతంలో వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా లేక రైతులు ఇబ్బంది పడేవారని, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక సాగునీటికి, విద్యుత్‌కు కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నారన్నారు. సమావేశంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ కూడా పాల్గొన్నారు.

మందుల నాణ్యతకు అధిక ప్రాధాన్యం

- మంత్రి దాడిశెట్టి రాజా
- ఔషధ నియంత్రణ కార్యాలయం ప్రారంభం


భవనం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని: ప్రజల ఆరోగ్యంలో మందులు కీలకమని, నాణ్యత ప్రమాణాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. మంగళవారం తుని పట్టణం నారాయణ రాజు గారి వీధిలో రూ.45 లక్షలతో నిర్మించిన ఔషధ నియంత్రణ తుని ప్రాంతీయ కార్యాలయ భవనాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణితో కలిసి రాజా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆసుపత్రులు, మందుల దుకాణాలపై పటిష్ఠమైన పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే తనిఖీలు నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఔషధ నియంత్రణ జిల్లా అధికారి డి.నాగమణి, తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, కౌన్సిలర్లు, వ్యాపారులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్
- రాజవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం


రాజవరంలో మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

రౌతులపూడి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం రాజవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని, గత మూడేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల హామీల అమలే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. కరోనా కష్ట కాలంలోనూ రైతు భరోసా, అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, వైఎస్సార్ ఆసరా తదితర సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఇలాంటి సుపరిపాలన అందుబాటులో ఉండాలంటే మరోసారి జగన్‌ను సీఎంగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గొల్లు చిన్నదివాణం, మండల వైస్ ఎంపీపీలు వాసిరెడ్డి భాస్కరబాబు, సాయి, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, ఎంపీటీసీ సామరౌతు నాని, వైఎస్సార్ సీపీ నాయకులు తిరుమల వెంకన్నదొర, సోమరౌతు భాస్కర్, కోఆప్షన్ సభ్యుడు సీహెచ్ వీరవెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ డీ పట్టాలు

పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు


కేఈ చిన్నయ్యపాలెంలో కొండపోడు భూములపై చర్చిస్తున్న ఆర్డీఓ సీతారామారావు

కోటనందూరు: అర్హులందరికీ డీ పట్టాలు పంపిణీ చేస్తామని ఆర్డీఓ జె.సీతారామారావు తెలిపారు. మంగళవారం కేఈ చిన్నయ్యపాలెంలో కొండపోడు భూములను ఆయన పరిశీలించారు. భూముల స్థితిగతులపై సాగుదారులతో చర్చించారు. 2014 నుంచి నిబంధనల పేరుతో పట్టాలు ఇవ్వలేదని, ప్రస్తుతం నిబంధనలు సడలించడంతో దరఖాస్తు చేసుకున్నామని సాగుదారులు వివరించారు. అనంతరం కొండపోడు భూములపై లబ్ధిదారులు, స్థానిక పెద్దలు, అధికారులతో ఆర్డీఓ చర్చించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే అనంతరం సాగు చేసుకుంటున్న ప్రతి పేదవాడికి డీ పట్టాలు అందజేస్తామన్నారు. సాగుదారుల్లో ఎస్టీ, ఎస్సీలకు అధిక ప్రాధాన్యముంటుందన్నారు. గ్రామంలో 208 మంది సాగుదారులను అర్హులుగా గుర్తించినట్టు ఆయన తెలిపారు. తహసీల్దార్ బాలసుబ్రహ్మణ్యం, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, వీఆర్వో సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే వేగవంతం చేయండి

శంఖవరం: జగనన్న శాశ్వత భూహక్కు చట్టం రీసర్వే పనులను వేగవంతం చేయాలని పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రెవెన్యూ అధికారులు, సర్వేర్లతో కలసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో రీసర్వే పనులు ఎంత వరకు జరిగాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆర్డీఓ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ అధికారులు పర్యటించి ప్రభుత్వ భూములను గుర్తించడంతో పాటు సర్వే చేపట్టాలన్నారు. సుమారు వంద ఏళ్ల తరువాత ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం ఈ సర్వే చేపడుతోందన్నారు. ఈ సర్వేతో గ్రామాల్లో రైతుల మధ్య ఉన్న దీర్ఘకాలిక భూసమస్యలు తొలగిపోతాయన్నారు. ఈ అవకాశాన్ని రైతులందరూ ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె.సుబ్రహ్మణ్యం, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

భీష్మ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి


మంగళవారం రాత్రి ఎనిమిది గంటలకు భక్తులతో నిండిపోయిన రామాలయం వద్ద విశ్రాంతి మండపం


అనివేటి మండపం వద్ద పుష్పాలతో రూపొందించిన సత్యదేవుడు, అమ్మవారి ఉత్సవమూర్తులు


సత్యదేవుని ప్రధానాలయానికి చేసిన పుష్పాలంకరణ

అన్నవరం: భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా రత్నగిరిపై ఏర్పాట్లు పూర్తయ్యాయి. సత్యదేవుని దర్శనానికి వచ్చే భక్తులకు అన్ని సదుపాయాలు కల్పించారు. స్వామివారి దర్శనానికి భారీ సంఖ్యలో భక్తులు విచ్చేయనున్నారు. మంగళవారం సాయంత్రం నుంచి వేల సంఖ్యలో భక్తులు రత్నగిరికి చేరుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం, విశ్రాంతి మండపాలు అన్నీ భక్తులతో నిండిపోయాయి. రాత్రి ఎనిమిది గంటల సమయానికి దేవస్థానానికి సుమారు పది వేల మంది విచ్చేశారు. స్వామివారి వ్రతాలు, ప్రత్యేక దర్శనం టిక్కెట్లు రాత్రి పది గంట నుంచే విక్రయించారు. అర్ధరాత్రి ఒంటి గంట దాటాక సత్యదేవుని వ్రతాల నిర్వహణ, స్వామివారి దర్శనానికి ఏర్పాట్లు చేశారు. బుధవారం ఉదయం పది గంటలకు సత్యదేవునికి లక్ష చామంతులతో పూజలు, రాత్రి ఏడు గంటల నుంచి గ్రామంలో గరుడ వాహనంపై ఊరేగింపు ఉంటుందని అధికారులు తెలిపారు. దేవస్థానం ఈఓ సత్యనారాయణమూర్తి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

పుష్పాలంకరణతో ప్రత్యేక శోభ

భీష్మ ఏకాదశి సందర్భంగా రత్నగిరిపై సత్యదేవుని ఆలయం, దాని దిగువన గల యంత్రాలయం, ధ్వజస్తంభం, అనివేటి మండపం వద్ద పుష్పాలతో ఏర్పాటు చేసిన స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులు అందరినీ ఎంతగానో ఆకర్షిస్తున్నాయి.

సీపీఐఎంఎల్ జనశక్తి రాష్ట్ర కార్యదర్శికి నివాళి

జగ్గంపేట: సీపీఐఎంఎల్ జనశక్తి రాష్ట్ర కార్యదర్శి నంబి నరసింహయ్యకు రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రామవరం, రంగవల్లి నగర్‌లో నిర్వహించిన సంతాప సభలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు, సంఘ నాయకులు బాబూరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణ రక్షణ కల్పించాలంటూ పోలీసులకు ఫిర్యాదు

జగ్గంపేట: ప్రాణ రక్షణ కల్పించాలంటూ అధికారులకు ఫిర్యాదు చేసినట్టు బాధితులు జగ్గంపేటకు చెందిన తోట రామారావు, అతని బంధువులు మంగళవారం విలేకరులకు తెలిపారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... జగ్గంపేట తోటవారి వీధికి చెందిన తోట రామారావు(దొరబాబు), అతని బంధువులకు గండేపల్లి మండలం జెడ్.రాగంపేట పరిధి ఆదిత్య ఆస్పత్రి సమీపంలో సర్వే నంబర్ 194/4లో 1.26 ఎకరాల భూమి, 194/5 లో 0.04 సెంట్లు భూమి కలిసి 1.30 ఎకరాల భూమి ఉంది. అయితే జగ్గంపేటకు చెందిన పెదిరెడ్డి బుచ్చిరాజు ఈ భూములకు చెందిన తప్పుడు పత్రాలను సృష్టించి, కాజేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. అంతేకాక బుచ్చిరాజు తమపై దాడి చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, అందుకు తగిన ఆధారాలు కూడా ఉన్నాయన్నారు. దీనిపై గండేపల్లి పోలీస్‌స్టేషన్, కాకినాడ స్పందనలో ఫిర్యాదు చేసినట్టు రామారావు తెలిపారు.

పాదగయ పుష్కరిణిలో షిల్టు తొలగింపు

పిఠాపురం: స్థానిక కుక్కుటేశ్వరస్వామి వారి ఆలయంలో పాదగయ పుష్కరిణి ప్రక్షాళన పనులు ప్రారంభించారు. మహా శివరాత్రి ఉత్సవాలు దగ్గర పడుతున్న నేపథ్యంలో పుష్కరిణిని శుభ్రం చేస్తున్నారు. చెత్తను షిల్టు తొలగించే మిషన్‌తో తొలగిస్తున్నారు. గతంలో మహా శివరాత్రి ఉత్సవాలకు ముందు పుష్కరిణిలో నీటిని తొలగించి శుభ్రం చేసి కొత్త నీటిని నింపేవారు కాని ప్రస్తుతం మిషన్ సహాయంతో అడుగున పేరుకు పోతున్న చెత్తను తీసివేస్తున్నారు.

సూపరింటెండెంట్‌గా రమణ

కొత్తపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం సూపరింటెండెంట్‌గా టీబీ వెంకటరమణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. రాజానగరం మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఈయన బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన నండూరి ప్రభాకర రామారావు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత


స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎంపీపీ రవి


గజ్జనపూడిలో విద్యార్థులకు పంపిణీ చేసిన స్టడీ మెటీరియల్

కిర్లంపూడి: పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు మంగళవారం స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. వీరవరం జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో 87 మంది పదో తరగతి విద్యార్థులకు ఎంపీపీ తోట రవి స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జి.నాగమణి, ఎంపీటీసీ తోట వేణు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం

ప్రత్తిపాడు రూరల్: ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి తెలిపారు. గజ్జనపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని పదో విద్యార్థులకు బుధవారం ఆమె స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాడు-నేడు పథకంలో పాఠశాలలను ఆధునీకరించి, కార్పొరేట్ పాఠశాలల మాదిరిగా తీర్చిదిద్దారన్నారు. అమ్మఒడి, విద్యాదీవెన, విద్యా వసతి వంటి పథ కాలను ప్రవేశ పెట్టడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, సర్పంచ్ గోనగాల అప్పలరాజు, స్కూల్ చైర్మన్ బర్ల లోవరాజు, ఎంపీటీసీ మొల్లి వీరబాబు, శాలివాహన జిల్లా అభివృద్ధి కమిటీ సభ్యుడు అనకాపల్లి నూకరాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు అడ్డుకోవాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కంబాలపాలెం కాలనీవాసులు

ఏలేశ్వరం: పట్టణంలోని కంబాలపాలెంకాలనీలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను అడ్డుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ విశ్వనాథశాస్త్రికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. కాలనీవాసులు మాట్లాడుతూ ఏలేరు ప్రాజెక్టులో తమ గ్రామం కంబాలపాలెం మునిగిపోవడంతో 1984లో ప్రభుత్వం పట్టణంలోని సర్వేనంబర్ 427లో ఇళ్లు నిర్మించి ఇచ్చిందన్నారు. వీటితో పాటు కమ్యూనిటీ స్థలానికి 86 సెంట్ల స్థలం కూడా కేటాయించిందన్నారు. ప్రస్తుతం ఆ స్థలం అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రూ.40 లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు. అభివృద్ధి పనులు చేపడుతుండగా కొందరు వ్యక్తులు అక్రమంగా నిర్మాణాలు చేపట్టారన్నారు. అధికారులు వెంటనే స్పందించి అక్రమ నిర్మాణాలు అడ్డుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ కోనాల వెంకటరమణ, అనంతారపురాజు, తుమ్మల రాంబాబు, కె కాశీ, కోనాల నాగేంద్ర, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మహాసభలను విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర కమిటీ సభ్యుడు బంగార్రాజు

ఏలేశ్వరం: సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ 11వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కేంద్ర కమిటీ సభ్యుడు బుగతా బంగార్రాజు కోరారు. స్థానిక లిబరేషన్ కార్యాలయంలో మంగళవారం జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు అధ్యక్షతన పార్టీ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఈనెల 15వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ పాట్నాలో నిర్వహించే పార్టీ జాతీయ మహసభలకు పార్టీశ్రేణులు హాజరుకావాలన్నారు. ప్రస్తుతం దేశంలో కొనసాగుతున్న అరాచక పాలనను ప్రతిఘటించాలన్నారు. ప్రధానిమోదీ నాయకత్వంలో దేశంలో ధరలు పెరిగి ఆర్థికసంక్షోభం నెలకొందన్నారు. రాష్ట్రాల హక్కులను హరించి దేశంలో రాజ్యాంగంలో ఫెడరల్ స్ఫూర్తికి తూట్లు పొడిందన్నారు. రాష్ట్ర విభజనలో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించడం ద్వారా దేశానికి విముక్తి కలిగించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.జనార్దన్, మానుకొండ లచ్చబాబు, కాకర రత్నకుమారి, రేచుకట్ల సింహాచలం, రాజాల రత్నం, తదితరులు పాల్గొన్నారు.